కన్ను పడిందో.. కబ్జానే

- కదిరి ప్రాంతంలో యథేచ్ఛగా భూకబ్జాలు
- నకిలీ రిజిస్ట్రేషన్లతోనూ పలువురికి టోకరా
- పట్టించుకోని రెవెన్యూ ఉన్నతాధికారులు



ఆర్డీఓ కార్యాలయం ముందు జగనన్న కాలనీకి వెళ్లేదారిలో కబ్జాకు గురైన భూమి

కదిరి అర్బన్: కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. విలువైన స్థలాలపై కన్నేసి ఆక్రమించేస్తున్నారు. కదిరి పట్టణం, మండల పరిధిలో కబ్జాదారులకు కొందరు ఉద్యోగులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్డీఓ కార్యాలయం ముందు ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే దారిలో సర్వే నంబర్ 96–1లో కబ్జాలు పెరిగిపోయాయి. కదిరి– హిందూపురం రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో అక్కడి భూములు విలువ అమాంతం పెరిగిపోయింది. దీన్ని ఆసరా చేసుకుని జగనన్న కాలనీకి వెళ్లే దారిలో రూ.కోట్లు విలువ చేసే ఎకరం పైబడి స్థలాన్ని కబ్జా చేశారు. విచిత్రమేమింటంటే జగనన్న కాలనీలో గుట్టపై లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. ప్రస్తుతం కబ్జాదారులు ఆ గుట్టకింద ఇష్టానుసారం జేసీబీలు పెట్టి తోడేస్తుండడంతో పైభాగంలోని ఇళ్లకు ప్రమాదం ముంచుకువస్తోంది.

నకిలీ రిజిస్ట్రేషన్‌తో భూమి కాజేత

కదిరి మండలం పట్నం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 625, 635, 637, 638లో భాస్కర్‌నాయక్ కుటుంబానికి చెందిన 5 ఎకరాల భూమిని ఫైజున్నీసా పేరిట 1బీ సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందులో రెవెన్యూకు సంబంధించిన ఉద్యోగి హస్తం ఉంది. నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం తెలుసుకున్న భూమి యజమానులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కుంట కబ్జా అడ్డగింత

కదిరి పట్టణంలోని వీవర్స్ కాలనీలో కుంటను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా కాలనీవాసుల ఫిర్యాదుతో రెవిన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాగా తమ భూమి కొంచెం కుంటలోకి వస్తుందని కుంటపక్కన భూమి యజమానులు చెప్పగా.. సర్వే చేసి కుంటకు హద్దులు చూపాలని వీఆర్‌ఓను తహసీల్దార్ ఆదేశించారు.

నకిలీ రిజిస్ట్రేషన్‌పై చర్యలేవీ?

ఆర్డీఓ కార్యాలయ సమీపంలో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సర్వే నంబర్ 1713–2లో 2.50 ఎకరాల భూమి కేటాయించింది. ఈ భూమిని టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు అహ్మద్‌అలీ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తమకు అన్యాయం చేశాడని పలువురు భవన నిర్మాణ కార్మికులు గత నెలలో ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదుపై ఇప్పటికీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అంతేకాకుండా జగనన్న కాలనీ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని సైతం అమ్మేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థలానికి ఇంత, పట్టా తయారు చేసేందుకు రెవెన్యూ వారికింత ఇవ్వాలని, లేదంటే పట్టా మీరే తయారు చేసుకుంటామంటే ఒక రేటు అని వ్యాపారం జరుగుతోందని చెపుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జగనన్న కాలనీకి వెళ్లే దారి పక్కన ఎవరైనా అక్రమంగా భూమి చదును చేసి పునాదులు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్కడ ఎవ్వరికీ పట్టాలు ఇవ్వలేదు. కొందరు ఇష్టారాజ్యంగా రాత్రిపూట జేసీబీతో చదును చేసి పునాదులు తీస్తున్నారు. అలాంటివారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. టీడీపీ నాయకులు అక్రమ పట్టాల విక్రయంపై, భవన నిర్మాణ కార్మికుల స్థలానికి సంబంధించి విచారణ చేసేందుకు ఆర్డీఓ ఆరుగురు రెవెన్యూ సిబ్బందితో కూడిన ఓ కమిటీని నియమించారు.

– మురళీకృష్ణ, తహసీల్దార్

రేపు యువత పోరు



యువత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న పార్టీ నేతలు డీఎస్ కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి

పుట్టపర్తి/ ముదిగుబ్బ: విద్యా సంవత్సరం ముగుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా విద్యా దీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న పుట్టపర్తిలో 'యువత పోరు' చేపడుతున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి తెలిపారు. ఈ మేరకు యువత పోరు పోస్టర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగే యువత పోరును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ చైర్మన్ తిప్పన్న, పుట్టపర్తి టౌన్, రూరల్ కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు నారాయణరెడ్డి, రాంజీనాయక్, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, రవినాయక్, విజయ్‌కుమార్, నారపరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఫీ, సోమ్లానాయక్, శ్రీనివాసులు, రామస్వామి, నాయక్, రామయ్య, రవి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా యువత పోరుకు ముదిగుబ్బ మండలం నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

కదిరి టౌన్: విద్యార్థుల సమస్యలపై ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం కదిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'యువత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఫణి, రెడ్డి, ఫయాజ్, చంద్రశేఖర్, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్పీకుంట: 'యువత పోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఈ నెల 12న నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో కదిరి నుంచి పుట్టపర్తికి బయల్దేరే 'యువత పోరు' కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు.

డీలర్లు అవినీతికి పాల్పడితే ఉపేక్షించం

సాక్షి ఎఫెక్ట్..



రాప్తాడులో రేషన్ షాపు దగ్గర విచారణ చేస్తున్న సీఎస్‌డీటీ జ్యోతి

రాప్తాడు: రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే సంబంధిత డీలర్‌ను సస్పెండ్ చేస్తామని తహసీల్దార్ విజయకుమారి, సీఎస్ డీటీ జ్యోతి హెచ్చరించారు. 'పేదల బియ్యం.. డీలర్ల భోజ్యం' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు, తహసీల్దార్ ఆదేశాల మేరకు స్పందించిన సీఎస్‌డీటీ జ్యోతి సోమవారం రాప్తాడులో ఉన్న మూడు రేషన్ షాపులను తనిఖీ చేసి, కార్డుదారులను విచారించారు. సీఎస్‌డీటీ మాట్లాడుతూ నిరుపేదలకు సబ్సిడీతో అందజేసే నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. డీలర్లు అవినీతికి పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే ఆ షాపు సీజ్ చేస్తామన్నారు. తూకాల్లో మోసం చేస్తే ఎంతటి వారినైనా క్షమించే ప్రసక్తే ఉండదన్నారు. కార్డుదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా డీలర్లు అధిక ధరలకు పంపిణీ చేస్తే కార్డు దారులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓ మహేష్ ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆర్డీఓ మహేష్ నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి 15 అర్జీలు స్వీకరించారు. వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రేపు జాబ్‌మేళా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగమేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 సంవత్సరాల నుంచి 33 సంవత్సరాల్లోపు ఉన్న వారు ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.13వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందని వివరించారు. ఎంపికైన వారు హైదరాబాద్, పెనుకొండ, పాలసముద్రం ప్రాంతాల్లో ఉద్యోగం చేయాలని తెలిపారు.

కష్టపడి చదివితేనే ఉన్నత స్థానాలకు..



సరస్వతీ పూజకు హాజరైన విద్యార్థులతో ఉపాధ్యాయుల బృందం

ఓడీచెరువు : చదువుల తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా తమపై ఉండాలని ఆకాంక్షిస్తూ విజ్ఞాన్ విద్యా సంస్థల పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ మారగానికుంట్ల ఫక్రుద్దీన్ మాట్లాడుతూ కష్ట పడి చదివితేనే ఉన్నత స్థానానికి ఎదుగుతారని, ప్రతి విద్యార్థీ వారి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆశలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కరస్పాండెంట్ సైరాభాను, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు తీర్చండి



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను తీర్చాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి చంద్రకళ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ మహేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఉత్తర్వులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. పేరుకు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులని చెబుతూ.. వేతనాలు మాత్రం అతి తక్కువ ఇస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలు సైతం అమలు చేయడంలేదని వాపోయారు. టీఏ బిల్లులు, సీబీ ఈవెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ ఇవ్వాలని, ఇంటి అద్దెలు పెంచాలని, ఐసీడీఎస్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, కార్మికులకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు పోతక్క, దీనా, సునీత, ఫాతిమా, చింతమ్మ, అరుణ, లక్ష్మీదేవి, గోవిందమ్మ, వేదవతి, గంగరత్న, చిట్టెమ్మ, సరస్వతి, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిన అంగన్వాడీలు

కనగానపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిచాలంటూ అంగన్వాడీలు విజయవాడలో చేపట్టిన మహా ధర్నాకు మండలంలోని పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తరలివెళ్లారు. సోమవారం కనగానపల్లి మండలంతో పాటు చెన్నేకొత్తపల్లి క్లస్టర్ పరిధిలో ఉన్న 172 అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు నివేదించినా పట్టించుకోకపోవటంతో ఈ ధర్నా చేపట్టినట్లు అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు లిపారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన విధంగా మినీ సెంటర్లను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

నాటుసారా నిర్మూలనతోనే ప్రగతి



నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ చంద్రమణి, కళాజాతా సభ్యులు

ధర్మవరం: నాటుసారాను నిర్మూలించి ప్రగతిని సాధిద్దామని ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో సోమవారం రాత్రి మానవహారంగా ఏర్పడి నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాజాతా బృందం పాడిన పాటలు, డ్యాన్స్‌ల ద్వారా నాటుసారా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. సీఐ చంద్రమణి మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ఓడీచెరువు : ఓడీచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దాదాపీర్ కొత్తచెరువులో వదాన్య స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన గణిత సంబంధ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచాడు. ఆదివారం అనంతపురం ఆర్డీటీ దివ్యాంగుల పాఠశాలలోజరిగిన సమావేశంలో దాదాపీర్‌ను ట్రోఫీ, సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఇంతటి ఘనత సాదించిన దాదాపీర్‌ను పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, గణిత ఉపాధ్యాయుడు గంగాధర్, రవిశంకర్, సునీతతో పాటు ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు

సంక్షిప్త సమాచారం

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న లాయర్ సుమలత

ధర్మవరం రూరల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా లాయర్ సుమలత హాజరయ్యారు. ఓబుళనాయనపల్లి క్లస్టర్ ఆధ్వర్యంలో 29 గ్రామాల మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్జీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. లాయర్ సుమలత మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, చట్టాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే సంతోషకరమైన జీవితం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ శ్రీనివాసులు, ఆర్డీటీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస కేసు

ధర్మవరం అర్బన్: టూ టౌన్ పోలీస్ స్టేషన్ గృహ హింస కేసు నమోదైంది. దుర్గానగర్‌కు చెందిన సాకే స్రవంతి ఫిర్యాదు మేరకు భర్త శ్రీనివాసులు, అత్త రాజేశ్వరి, ఆడపడుచులు ముత్యాలమ్మ, వరలక్ష్మి, బావ నీలకంఠపై గృహహింస నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప సోమవారం తెలిపారు. కేసు పెట్టిన విషయం తెలుసుకున్న శ్రీనివాసులు తన భార్య స్రవంతిపై కొడవలితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు భర్తపై మరో కేసు నమోదు చేశారు. ఆ తర్వాత స్రవంతి బంధువులు చెన్నకేశవులు, లక్ష్మీదేవిలు వచ్చి శ్రీనివాసులు, అత్త రాజేశ్వరిపై దాడి చేయడంతో.. వారు కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌కాలనీలో దొంగతనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ కాలనీకి చెందిన మున్సిపల్ ఉద్యోగి బోయ వీరన్న ఆదివారం రామగిరి మండలంలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగలకొట్టి ఉంది. లోనికెళ్లి చూడగా బీరువాలోని జత బంగారు కమ్మలు, రూ.40వేల నగదును కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

ఓడీచెరువు : మండల కేంద్రం సమీపంలోని ఎం.కొత్తపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 216లో 217 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందని, అందులో ఇంటి పట్టాలు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల వెంకటరమణ, పీట్ల సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా వినియోగం హానికరం

పుట్టపర్తి అర్బన్: నాటుసారా వినియోగం, అక్రమ మద్యం రవాణా, మద్యం తయారు చేయడం, అమ్మడం హానికరమని ఎక్సైజ్ సీఐ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పుట్టపర్తి మండలం పెడపల్లి పెద్ద తండాలో 'నవోదయం 2.0' నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ్లీ బాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు ఆసిఫ్, రాజు, సాజియా

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ పృథ్వీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా కబడ్డీ పోటీల్లో ధర్మవరం క్రీడాకారులు ఆసిఫ్, రాజు, సాజియా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలోనూ క్రీడాకారులు రాణించాలని కోచ్ ఆకాంక్షించారు.

రేపటి నుంచి కాటి కోటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరుని ఆలయంలో ఈ నెల 12 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు సాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్తలు సుధాకర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

'హరీష్ నోరు అదుపులో పెట్టుకో'

పుట్టపర్తిటౌన్: ధర్మవరం బీజేపీ నాయకుడు హరీష్‌కుమార్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను విమర్శించే స్థాయి లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హెచ్చరించారు. సోమవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో విలేకర్లతో మాట్లాడారు. ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లి తండాలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని బీజేపీ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, అనుచరుల పేరుతో అక్రమంగా పాస్ బుక్కులు చేయించుకున్నారన్నారు. ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయించారని ఎంపీపీకి అనుకూలంగా మాట్లాడి.. గిరిజనుల పక్షాన నిలిచిన సీపీఐ నేత రామకృష్ణను విమర్శించాలని చూస్తే ఊరుకునేది లేదని హరీష్‌కుమార్‌పై మండిపడ్డారు.

ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే 120 మంది విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. కానిస్టేబుల్ భాస్కరరాజు, వాల్మీకి సంఘం నాయకులు ఆనంద్ సంయుక్తంగా హెచ్‌ఎం సిద్దారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

ఎన్పీకుంట: మండల కేంద్రంతో పాటు ధనియానిచెరువు పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను సోమవారం ఈఓపీఆర్డీ మాధవరెడ్డి పరిశీలించారు. రోజూ ఉదయం పారిశుధ్య కార్మికులు ఇంటింటి నుంచి చెత్త సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తను వేరుచేసి తొట్లల్లో వేయాలని సూచించారు. తడి చెత్తను వర్మికంపోస్టు తయారీకి వినియోగించాలని, పొడి చెత్తను ప్రతి గురువారం విక్రయించి, సొమ్మును పంచాయతీకి జమ చేయాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

చెన్నేకొత్తపల్లి: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగసముద్రం గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ సత్యనారాయణ భోజన సౌకర్యం కల్పించారు.

దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ట్రాక్టర్ వ్యవసాయ పరికరాలు, స్ప్రేయర్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

పాఠశాల ముందే మురుగు



ధర్మవరం అర్బన్: పట్టణంలోని పార్థసారథి నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ముందే మురుగునీరు పారుతోంది. పాఠశాల చుట్టూ ఉండే ఇళ్లకు సంబంధించి కాలువలు నిర్మించకపోవడంతో అక్కడి మురుగునీరు మొత్తం పాఠశాల ప్రధాన గేటు వద్దకు చేరుతోంది. ఆ మురుగునీటి దుర్వాసన భరించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



కన్వీనర్లను సన్మానిస్తున్న వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ నూతన పట్టణ అధ్యక్ష, మండల కన్వీనర్లు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి సూచించారు. ఇటీవల నియమితులైన కదిరి పట్టణ అధ్యక్షులు షేక్ బాబ్జాన్, రూరల్ మండల కన్వీనర్ మణికంఠనాయక్, నల్లచెరువు కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, గాండ్లపెంట కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తలుపుల కన్వీనర్ ఫయాజ్, ఎన్పీకుంట కన్వీనర్ రంగారెడ్డి, తనకల్లు కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డి సోమవారం కదిరిలోని వజ్రభాస్కర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి పూలమాలతో సన్మానించారు. అనంతరం నూతన కన్వీనర్ల చేత కేక్ కట్ చేసి వజ్రభాస్కర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. కూటమి ఎన్నికల హామీల అమలుపై పోరాడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీని మరింత పటిష్టం చేసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎన్పీకుంట: ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్యనందించాలని ఎంపీడీఓ అంజినప్ప ఉపాధ్యాయులకు సూచించారు. పెడబల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యా ప్రమాణాలను పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విజయ్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

బత్తలపల్లి: వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో తీసుకున్న రుణాలను ఈ నెల 25లోపు రెన్యూవల్ చేసుకోవాలని సంఘం ఇన్‌చార్జ్ హరియాదాస్, సూపర్‌వైజర్ మహేష్, సీఈఓ పృథ్వీకుమార్‌రెడ్డి, మాజీ సీఈఓ జక్కంపూటి నాగభూషణ సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో వారు మాట్లాడుతూ రైతులు తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను 25వ తేదీలోపు రెన్యూవల్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.